పరమ పవిత్రం.. ఉదయకళేశ్వరుని క్షేత్రం

- ఉదయపు కిరణాలతో ప్రకాశించే శివుడిగా ప్రసిద్ధి
- నేటి నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు

జిల్లాలో ప్రాచీన శైవక్షేత్రంగా, శతాబ్దాల నాటి చరిత్రకు సాక్ష్యంగా ఉదయకళేశ్వర స్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. ఉదయపు సూర్య కిరణాలతో ప్రకాశించే శివుడిగా పేరున్న ఈ ఆలయంలో ఏటా జరిగే బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు వేలాదిగా తరలి వస్తారు. ఈ మేరకు ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.


బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఉదయకళేశ్వరస్వామి ఆలయం

కొడవలూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కొడవలూరు మండలం గండవరంలో కొలువైన గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన గిన్నెభిక్ష, కల్యాణం, రథోత్సవాలకు ఎస్సై కోటిరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడి ఆలయానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. దీనిని అలుతిరుకాళ్తి అనే పల్లవ మండలాధిపతి, త్రిభువన చక్రవర్తి బిరుదాంకితుడు కుళోత్తుంగ చోళదేవ మహారాజుల చేత రూపుదిద్దుకున్నట్లు దేవస్థానం వద్దనున్న తమిళ, తెలుగు శాసనాల ద్వారా తెలుస్తోంది.

స్వామివారి ప్రత్యేకత

ఉదయాన్నే వచ్చే సూర్య కిరణాలు స్వామివారి లింగాకారంపై పడుతాయి. ప్రథమ కిరణాలు నేరుగా స్వామివారి లింగాకారంపై పడడం వల్లే స్వామివారికి ఉదయకళేశ్వరస్వామి అని నామకరణం చేసినట్లు పెద్దలు చెబుతారు. అందువల్లే బ్రహ్మోత్సవాల్లో ఇక్కడి స్వామివారిని భక్తిశ్రద్ధలతో సేవించి మొక్కులు తీర్చుకున్న వారికి దీర్ఘకాల వ్యాధులు తొలగి, అష్ట ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని అంటారు.

భక్తుల తాకిడి

తొమ్మిది రోజుల పాటు జరుగనున్న బ్రహ్మోత్సవాల్లో రథోత్సవం, తెప్పోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. స్వామివారి రథాన్ని స్వహస్తాలతో లాగి, ఇక్కడ స్నానమాచరించి తెప్పోత్సవాన్ని తిలకిస్తే సుఖసంతోషాలతో ఉంటారనే విశ్వాసం ప్రజల్లో ఉంది. దీంతో వేలాదిగా భక్తులు తరలివస్తారు. తెప్పోత్సవం రోజున గండవరానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేస్తారు.

ఉత్సవాలిలా..

బ్రహ్మోత్సవాల్లో 22న అంకురార్పణ, 23న ధ్వజారోహణ, శేష వాహనోత్సవం, 24న సింహ వాహనోత్సవం, 25న రావణసేవ, 26న గిన్నె భిక్ష, లింగోద్భవ కలశాభిషేకం, మహాశివరాత్రి, వెండి నందిసేవ, పూలంగి సేవ, 27న కల్యాణం, గజ వాహనోత్సవం, 28న రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం, 1న త్రిశూల స్నానం, వసంతోత్సవం, పారువేట, అశ్వవాహనోత్సవం, 2న ఏకాంత సేవ, స్పెషల్ దర్బారు అలంకారం ఉంటుంది.

ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం



ఈ ఏడాది బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. 25న జాతీయ స్థాయి ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన ఉంటుంది. 28న రాత్రి సినీ గాయని మంగ్లీ బృందంచే పాట కచ్చేరి ఉంటుంది. అదేవిధంగా 26 నుంచి 28 వరకు రోజూ రాత్రి కూచిపూడి నృత్య ప్రదర్శనలుంటాయి. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– ఆలం మాలకొండయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్


స్వామివారి కల్యాణం నిర్వహించే 24 కాళ్ల మండపం


భక్తులు స్నానమాచరించే కోనేరు


స్వామివారు కొలువైన ఆలయం

క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

కొడవలూరు: పెమ్మారెడ్డిపాళెం పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొంటున్నట్లు ఎంపీడీఓ సుబ్బారావు తెలిపారు. ఇక్కడి తాగునీటి సమస్యపై గ్రామస్తులు స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి విన్నవించుకున్నారు. దీంతో ఆమె ఆదేశాలతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హర్షితతో కలిసి ఎంపీడీఓ శుక్రవారం పెమ్మారెడ్డిపాళెంతోపాటు మజరా గ్రామాలైన రమణారెడ్డి గుంట, దొరువుదిబ్బ, సంగాయపాళెంలలో పర్యటించి తాగునీటి సమస్య ఉన్నట్లు గుర్తించారు. 15వ ఆర్థిక సంఘ నిధులతో మోటార్లకు మరమ్మతులు, కొత్త మోటార్ల ఏర్పాటు ద్వారా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీలత ఉన్నారు.

ఫలితాల మేరకే ఎరువుల వినియోగం


భూ పరీక్ష ఫలితాలను అందజేస్తున్న అధికారులు

విడవలూరు : రైతులు మట్టి పరీక్షలు నిర్వహించి ఫలితాల ద్వారా ఎరువులను వినియోగిస్తే అధిక దిగుబడులు సాధ్యమని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివనారాయణ, ఏడీఏ కన్నయ్య అన్నారు. మండలంలోని అలగానిపాడు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సాయిల్ టెస్ట్ ఫలితాల నమూనాలను శుక్రవారం వారు రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేల సారవంతానికి రైతులు తప్పకుండా భూ పరీక్షలు చేయించి, వ్యవసాయ అధికారులు సూచించిన ఎరువులను వాడాలని సూచించారు. మండల ఏఓ పి.వెంకటకృష్ణయ్య, హెచ్‌ఎం శ్రీనివాసులు, సైన్స్ ఉపాధ్యాయులు షావలి, వీఏఏ కామాక్షి, సర్పంచ్ పి.శేషయ్య పాల్గొన్నారు.

డబ్బు కోసం మహిళను కత్తితో బెదిరించి..

- యువకులపై హత్యాయత్నం కేసు

విడవలూరు: డబ్బు కోసం మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో ఇద్దరు యువకులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్సై నరేష్ కథనం మేరకు.. విడవలూరులోని సినిమా హాల్ సెంటర్ వద్ద ఉన్న వైన్ షాపు పక్కన గున్నం పద్మ అనే మహిళ కూల్‌డ్రింక్ షాపు నిర్వహిస్తోంది. అదే గ్రామానికి చెందిన పాశం భానుప్రకాశ్, ఒబ్బారెడ్డి గౌతమ్ అనే యువకులు బుధవారం సాయంత్రం ఆమె వద్దకెళ్లి డబ్బులు కావాలని అడిగారు. గతంలో పలుమార్లు ఇలానే ఆమెను బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో ఆమె ఇవ్వనని చెప్పింది. ఆ ఇద్దరు కత్తి తీసి డబ్బు ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరించారు. నీ తమ్ముడిని పొడిచినట్లే నిన్ను కూడా పొడుస్తామని భయపెట్టి షాపులోని డబ్బులు తీసుకెళ్లారు. గతంలో గౌతమ్ అనే వ్యక్తి పద్మ తమ్ముడు శ్రీకాంత్‌ను కత్తితో పొడిచి జైలుకెళ్లి వచ్చాడు. తాజాగా బాధితురాలి ఫిర్యాదుతో గురువారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం నిందితులను కోర్టుకు హాజరుపరిచారు.

బావిలో పడి వ్యక్తి మృతి

తోటపల్లిగూడూరు: బావిలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని చిన్నచెరుకూరు గ్రామంలో శుక్రవారం వెలుగు చూసింది. ఎస్సై వీరేంద్రబాబు కథనం మేరకు.. చిన్న ఎస్టీ కాలనీకి చెందిన కోట్ల బాబు (39) బేల్దారి పనులు చేస్తుంటాడు. అతడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. మూడురోజుల క్రితం పనికి వెళ్లిన బాబు తిరిగి ఇంటికి రాలేదు. కాగా గ్రామంలోని ఎస్టీ కాలనీ సమీపంలో ఉన్న బావిలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని బయటకు తీయించి బాబుగా గుర్తించారు. ప్రమాదవశాత్తు పడి మృతిచెందినట్లుగా నిర్ధారించారు. మృతదేహాన్ని నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్‌అండ్‌బీ అధికారుల పరిశీలన

రాపూరు: రాపూరు – చిట్వేలి దారిలో ఘాట్ రోడ్డులో పలు ప్రాంతాల్లో మలుపుల వద్ద రక్షణ గోడలు పడిపోగా ఆర్‌అండ్‌బీ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ముఖ్యంగా రాపూరు నుంచి చిట్వేలి మార్గంలో సరిహద్దు వరకు పలుచోట్ల రక్షణ గోడలు పడిపోయాయి. ప్రమాదం సంభవిస్తే వాహనాలు లోయలో పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో వాహనదారులు భయపడుతూ ప్రయాణం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ ఏఈ మనోహర్ మాట్లాడుతూ రక్షణ గోడల నిర్మాణానికి రూ.1.85 కోట్లు, సీసీ బర్మ్‌స్‌కు రూ.1.55 కోట్లు, పిట్టగోడలకు రూ.5 లక్షలు అంచనాలు వేసి పంపామని వెల్లడించారు.

విద్యుత్ మోటార్ చోరీ

వెంకటాచలం: మండలంలోని కసుమూరు పంచాయతీ అనకాడ వడ్డిపాళెం గ్రామానికి చెందిన రైతు బెల్లంకొండ గోపీ తన పొలంలోని విద్యుత్ మోటారు చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామ సమీపంలోని గోపీ పొలంలో ఉన్న సుమారు రూ.25 వేల విలువైన మోటార్ గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన గోపీకి మోటార్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నేడు ప్రత్యేక ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమం

ముత్తుకూరు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం ప్రత్యేక ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమం జరుగుతుందని డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని వెల్లడించారు.

రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం తగదు


నిరసన వ్యక్తం చేస్తున్న నరసాపురం గ్రామస్తులు

ఇందుకూరుపేట: మైపాడు– నెల్లూరు రోడ్డు నిర్మాణంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం తగదని మండలంలోని నరసాపురం గ్రామస్తులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. దీంతో సుమారు గంటపాటు వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా డ్రెయినేజీలు నిర్మించి రోజుల తరబడి వాటిని మూయకుండా వదిలేస్తున్నారని వాపోయారు. అలాగే రోడ్డును వేయడంలో నాణ్యత పాటించడం లేదని ఆరోపించారు.

వెయ్యి ఎకరాల్లో రీసర్వే పూర్తి


రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

ముత్తుకూరు: మండలానికి ఒక రెవెన్యూ గ్రామంలో తలపెట్టిన భూముల రీసర్వే పైనాపురం రెవెన్యూ గ్రామంలో ఇప్పటి వరకు వెయ్యి ఎకరాల్లో పూర్తైంది. పైలట్ ప్రాజెక్ట్ కింద ముత్తుకూరు మండలంలోని పైనాపురం గ్రామంలో గత నెల భూముల రీసర్వే ప్రారంభించారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మొత్తం 3,441 ఎకరాలను 12 బ్లాకులుగా విభజించారు. సర్వే చేసేందుకు 5 బృందాలను ఏర్పాటు చేశారు. ఒక వీఆర్వో, ఒక వీఆర్ఏ, ఇద్దరు విలేజ్ సర్వేయర్లు ఒక బృందంగా ఏర్పడి సర్వే చేపట్టారు. ఒక బ్లాకులో 200 నుంచి 250 ఎకరాలు ఉండేలా చూసుకుని సర్వే ప్రారంభించగా, 10 రోజుల క్రితం పట్టా భూముల్లో సర్వే మొదలుపెట్టారు. రైతుల సమక్షంలో సర్వే చేస్తున్నట్టు శుక్రవారం రెవెన్యూ అధికారులు తెలిపారు.

చెరువు భూముల ఆక్రమణపై విచారణ


ఆక్రమణలను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

మనుబోలు: మండలంలోని కొండూరుసత్రం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల ఆక్రమణలపై శుక్రవారం ఇరిగేషన్ అధికారులు విచారణ చేపట్టారు. ఇరిగేషన్ డీఈ శంకరనారాయణ ఏఈ వెంకటేశ్వరుతో కలిసి నిడిగుంట, పాకాల చెరువుల భూములను పరిశీలించారు. ఆక్రమణలపై ఇటీవల పలువురు రైతుల నుంచి కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లడంతో పరిశీలించేందుకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. చెరువు భూములు ఆక్రమణకు గురైన విషయం వాస్తవమేనన్నారు. అలాగే చెరువుల నుంచి పెద్దఎత్తున మట్టి తరలించడంతో పెద్ద గోతులు ఏర్పడ్డాయన్నారు. ప్రస్తుతం నీళ్లు ఉండటంతో ఆక్రమణలు, లోతుపై స్పష్టత లేదన్నారు. మొత్తం చెరువు భూములు ఎంత ఉన్నాయి?, ఎంతమేరకు ఆక్రమణకు గురైంది? అనే విషయాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కోరామని తెలిపారు. నివేదిక వచ్చాక హద్దులు ఏర్పాటు చేసి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. వారి వెంట ఉప సర్పంచ్ ఆవుల తులసీరామ్, మాజీ సర్పంచ్ వెందోటి భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

రుణాలకు లబ్ధిదారుల ఎంపిక


ఎంపికలకు హాజరైన దరఖాస్తుదారులు

తోటపల్లిగూడూరు: రుణాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు జరిగాయి. బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్లకు సంబంధించి మండలానికి 30 యూనిట్లు మంజూరు కాగా 327 మంది దరఖాస్తులు చేసుకున్నారు. తోటపల్లిగూడూరు, నరుకూరు, పేడూరులో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కోడూరు కెనరా బ్యాంక్, ఈదూరులోని పినాకినీ గ్రామీణ బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలను నిర్వహించి దరఖాస్తుదారుల అర్హత పత్రాలను పరిశీలించారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

క్రీడా ప్రాంగణ అభివృద్ధికి కృషి


కళాశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

విడవలూరు: పీఆర్ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకామ్ చదివిన పూర్వ విద్యార్థులు (1992–95) శుక్రవారం కళాశాలలో సమావేశమయ్యారు. క్రీడా ప్రాంగణ అభివృద్ధికి కృషి చేస్తామని ప్రకటించారు. ఈ మేరకు ప్రిన్సిపల్ బి.సుజాతతో సమావేశమై, విదేశాల్లో వ్యాపారాలు చేస్తున్న పూర్వ విద్యార్థి మడపర్తి వేణుగోపాల్ కళాశాల క్రీడా ప్రాంగణం అభివృద్ధికి రూ.లక్ష నగదు అందిస్తారని వెల్లడించారు. పూర్వ విద్యార్థి చెముకుల శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపల్ మధు పాల్గొన్నారు.

ప్రభుత్వ పెన్షనర్ల సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 9.30 గంటలకు భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్స్ సంఘం భవనంలో జరుగనుందని ఆ శాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ఎం గౌస్, ఎస్వీవీఎస్ మూర్తి శుక్రవారం తెలిపారు. జిల్లా ఆడిట్ అధికారి ఎం.తిరుపతయ్య ముఖ్యఅతిథిగా హాజరై, పెన్షన్ మంజూరు, జీపీఎఫ్ ప్రతిపాదనలు తదితర విషయాలను వివరించడంతో పాటు పెన్షనర్ల సందేహాలను నివృత్తి చేస్తారన్నారు. అలాగే 'ఎనెల్' హాస్పిటల్‌కు చెందిన జనరల్ ఫిజీషియన్ డాక్టర్ పి.హరికృష్ణ వయోభారంతో వేసవికాలంలో ఎదురయ్యే పలు ఆరోగ్య సమస్యలతో పాటు రోజువారీ తలెత్తే వివిధ వ్యాధులకు సంబంధించి అవగాహన కల్పిస్తారన్నారు. సమావేశానికి జిల్లాలోని పెన్షనర్స్‌తో పాటు, అసోసియేషన్ బాధ్యులు తప్పనిసరిగా హాజరై జయప్రదం చేయాలని కోరారు.

మాతృభాష పరిరక్షణకు కృషి

- వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సునీత

వెంకటాచలం: మాతృభాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ భాషను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. జి.సుభద్రాదేవి, డాక్టర్ కె.ఈశ్వరమ్మ, అవ్వారి శ్రీధర్‌బాబు మాతృభాష గొప్పతనాన్ని గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



వెంకటాచలం: వీఎస్‌యూలో..

ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో..

మండలంలోని సరస్వతీనగర్ వద్దనున్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో మాతృభాషా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆ కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ మాట్లాడుతూ అమ్మభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తమిళనాడులో తెలుగు భాషోద్యమకారుడైన ఆచార్య సీఎంకే రెడ్డి మాతృభాష ఉన్నతి కోసం అఖిల భారత తెలుగు సమాఖ్య చెన్నై వేదికగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సాహితీవేత్త డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ పాల్గొన్నారు.

- **పొదలకూరు:** పట్టణంలోని విజేత స్కూల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కరస్పాండెంట్ జి.కామాక్షి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

కొడవలూరు: మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని యల్లాయపాళెం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థుల సాంప్రదాయ నృత్య, నాటిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థుల బుర్రకథ, నాటిక ప్రదర్శనలతో పాటు విద్యార్థినులు చేసిన ఆదివాసీ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎ.మోహన రామలింగయ్య, తెలుగు ఉపాధ్యాయులు చెంచయ్య, మోహన్, పెంచలయ్య, సుజాత, కృష్ణసుధా పాల్గొన్నారు.


వెంకటాచలం: ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో..


పొదలకూరులో..


కొడవలూరు: యల్లాయపాళెం హైస్కూల్లో..

25న ఇంటర్వ్యూలు

పొదలకూరు: బీసీ, ఓబీసీలకు కేటాయించిన సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 25వ తేదీన మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీఓ సాయిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూల్లో మండలంలోని బ్యాంకర్లు పాల్గొంటారని చెప్పారు. మొత్తం 46 యూనిట్లను ప్రభుత్వం కేటాయించినట్టు వెల్లడించారు. 30 గ్రామ పంచాయతీల నుంచి 556 దరఖాస్తులు అందాయన్నారు. వారు విధిగా ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సిందిగా సూచించారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా సాయిప్రసాద్

పొదలకూరు: ఇన్‌చార్జి ఎంపీడీఓ (ఎఫ్ఏసీ)గా కొడవలూరు ఇన్‌చార్జి ఎంపీడీఓ సాయిప్రసాద్‌ను నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎల్ నరసింహారావు అనారోగ్య కారణాలతో దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. ఈ క్రమంలో సాయిప్రసాద్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఈయనకు పొదలకూరు పంచాయతీ సెక్రటరీగా పనిచేసిన అనుభవం ఉంది.

ఎమ్మెల్యే పర్యటన

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు గ్రామంలో శుక్రవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పర్యటించారు. రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో రాష్ట్ర ప్రజలకు మంచి రోజులు వచ్చాయన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులున్నారు.

పెంచలకోన అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

రాపూరు: రాపూరు మండలంలోని పెంచలకోన క్షేత్రం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి మంత్రి దర్శించుకున్నారు. అనంతరం ఆనం మాట్లాడుతూ ప్లాన్‌ను త్వరలో ఆమోదింపజేసి ఆలయాభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. టీటీడీ గదుల ప్రారంభోత్సవానికి శ్రీకారం చుడతామన్నారు. మే నెలలో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఈఓ శ్రీనివాసులరెడ్డి, ప్రజాప్రతినిధులున్నారు.

కండలేరులో 52.646 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 52.646 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 720, లోలెవల్ కాలువకు 150, హైలెవల్ కాలువకు 190, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.